# పుణ్యక్షేత్రం

ఆకెళ్ల శివప్రసాద్

"అడుగడుగున గుడివుంది.... అందరిలో గుడివుంది... ఆ గుడిలో దీప ముంది.... అదియే దైవం...."

నిశ్శబ్దాన్ని అందంగా చీలుస్తూ మధురంగా వినిపిస్తోంది పాట. మాకు సమయం తెలీలేదు.

సావిట్లోకే కాఫీలు వచ్చాయి. సీతమ్మగారే అందరికి స్వయంగా అందించారు.

ఏమిటీ బంధం?

సీతమ్మగారికి, శివయ్యగారికీ మాకూ ఏమిటి సంబంధం?

ఏమాత్రం సంబంధంలేని మమ్మల్ని ఇంత ఆదరణగా, ఆప్యాయంగా చూస్తున్నారు. ఇది నిజంగా మా అదృష్టం. లేకపోతే ఆ చీకటిర్రాత్రి, ఆడవాళ్ళతో పిల్లలతో ఎంత కష్టపడవలసివచ్చేదో?

శ్రీశైలం యాత్రకి బయలుదేరాము మేమంతా. ఓటూరిస్టుబస్ 'కాంట్రాక్టు' తీసుకున్నాం.

మధ్యదారిలో వున్నట్టుండి బస్సు ఆగిపోయింది.

'ఇంజన్‌లో ఏదో పాడయ్యింది. బస్సు కదలదు అన్నాడు డ్రైవర్.

వెంటనే ఏమిచేయాలో తోచలేదు.

మధ్యదారి. చుట్టూచెట్లు. చీకటి.

దగ్గర్లో యిళ్ళువున్న చాయలు కన్పించడంలేదు.

ఇప్పుడు డ్రైవర్‌ని తిట్టడం అనవసరం. మెల్లగా కదిలాము నేనూ, పార్వతీశం బ్యాటరీలైటుతీసుకొని, దగ్గిర్లో ఏదైనా 'వసతి'లాంటిది వుందేమోనని.

అరగంట తిరిగాకా—

దూరంగా కన్పించింది.

వెన్నెట్లో కుటీరంలాంటి యిల్లు.

అటువైపు అడుగులువేశాము.

ఇంటిచుట్టూ పూలమొక్కలు.

మెల్లగా తలుపు తట్టాను.

'ఏమండీ!' పార్వతీశం పిలిచాడు.

నిముషం తరువాత తలుపులు తెరుచుకున్నాయి.

పండు ముత్తయిదువ చేతిలో హరికేన్ లాంతరుతో మాకేసిచూసింది.

మేము మాగురించి చెప్పాము. ఆడవాళ్ళు, పిల్లలు వున్నారని, ఈ రాత్రికి కాస్త 'వసతి' కావాలని కోరాం.

మాటలమధ్యలో లోపల్నుంచి ఓ ముసలాయన వచ్చారు.

మరో ఐదునిముషాల తరువాత వాళ్ళింట్లో మేముండడానికి అంగీకరించారు.

మేము వెనుతిరిగి బస్సు ఆగినప్రాంతానికి వచ్చి మిగిలినవాళ్ళనికూడా తీసుకొని యిల్లుచేరుకొనేసరికి—

దంపతులు యిద్దరూ ఎదురుచూస్తున్నారు.

మాకు దుప్పట్లు, రగ్గులు వగైరాలు అందించారు.

ఇద్దరు ముగ్గురు ముసలివాళ్ళకి 'మంచాలు'కూడా యిచ్చారు.

మరో అరగంట తరువాత నిద్రకుపక్రమించాము.

నేను నిద్రనుండి లేచేసరికి—

ఇల్లంతా హడావుడిగావుంది. మావాళ్ళు నానాహడావిడిచేస్తున్నారు.

బావివైపు నేను వెళ్ళేసరికి నుయ్యి మందువాలో మా శాస్త్రిలు స్నానం చేస్తున్నారు. అటువైపు సుబ్బమ్మత్తయ్య ఏవో బట్టలు వుతుకుతోంది. కొంచెం దూరంలో నరసింహం సూర్యనమస్కారాలుచేస్తున్నాడు. పిల్లలు నానాగొడవా చేస్తున్నారు.

కాలకృత్యాలు తీర్చుకొని వచ్చేసరికి శివయ్యగారు అరుగుమీదకూర్చొని 'శివానందలహరి' పఠిస్తున్నారు. సీతమ్మగారు లోపల వంటహడావిడిలో ఉన్నారు.

డ్రైవర్‌ని, మరో యిద్దరిని 'బస్సు' విషయమై పంపించాము.

'కనీసం ఓరోజు పడ్తుంది మరోబస్సు రావడానికి'అని చెప్పాడు డ్రైవర్.

మరో గంట తరువాత భోజనాలు సిద్ధం.

భోజనాలు పూర్తయ్యాకా—

"గోవిందా... గోవిందా..." అంటూ పొలికేకలాంటిదిపెట్టి 'బ్రేవ్'మంటూ త్రేన్చుకుంటూ, చెంబులు చేతుల్లోకి తీసుకొని కొందరు ఆ పక్కగా చేతులు కడుక్కుంటుంటే, మరికొందరు చెంబులుపట్టుకొని ఒక్కటే పరుగు, మరికొందరు పీకలదాకా తినేసరికి కదలలేక అక్కడే కూర్చుండిపోయారు.

సీతమ్మగారి కళ్ళల్లో గిర్రున నీళ్ళు....

శివయ్యగారి సంగతి చెప్పక్కర్లేదు....

"అయ్యా... తమరు భోంచేశారా?" అడిగాను.

'ఇంకా చెయ్యాలంటావా? మీరందరు చేశారుగా...." శివయ్యగారన్నారు. నేనేమి మాట్లాడలేకపోయాను.

"ఏమండి చంటాడు జామచెట్టు ఎక్కుతూ పడ్డాడు...." మా ఆవిడ ఆత్రంగా నాదగ్గరకు వచ్చింది.

"ఏమిటీ? ఎక్కడా?..." అంటూ సీతమ్మగారు కదిలారు. ఆవిడ వెనకే శివయ్యగారు కూడా కదిలారు.

బుజ్జిగాడి కాలు గీరుకుపోయివుంది.

"వెధవ... అడ్డమైనపన్లుచేస్తే..." దండకం అందుకోబోతుంటే—

"నువ్వు ఆగవయ్యా.... అసలే పిల్లాడు పడి ఏడుస్తుంటే..." అంటూ శివయ్యగారు లోపలికివెళ్ళారు. నిముషం తరువాత ఏదో మందులాంటిది తెచ్చి రాశారు గాయమ్మీద.

మధ్యాహ్నం శివయ్యగారు ఎక్కడ్నుంచో 'గ్రామ్‌ఫోన్' తెచ్చారు. పాత కాలంనాటి పాటలు వింటుంటే కాలం తెలీలేదు. నాకు తెలీకుండానే నిద్రలోకి జారుకున్నాను.

లేచేసరికి—

గోడగడియారం ఐదున్నర చూపెడ్తోంది.

సాయంత్రం ప్రశాంతంగా వుంది.


యింటిముందరి పూలమొక్కలు గాలి అలలతాకిడికి మెల్లగాఊగుతున్నాయి.

అరుగుమీద శివయ్యగారు కూర్చున్నారు.

ఆయన ఒళ్ళో 'రత్నం' కొడుకు—

నేను ఆయన దగ్గరకి వెళ్ళేసరికి—

"ఇప్పుడేవస్తానయ్యా... కాస్త వీడ్ని తీసుకో...." అని వాడ్నిలా చేతికి అందించారు.



ఓ ఐదునిముషాల తరువాత—

తిన్నగా ఒళ్ళోకూర్చున్నవాడు కూర్చోకుండా ఆయన వెండి మీసాలతోనే అదుకున్నట్టు అదుకొని 'తడి' చేశాట్ట—

"శివయ్యగారు.... రేపు వెళ్దామనుకుంటున్నాము.... మావాళ్ళు రేపటికి బస్సుతీసుకొని వచ్చేస్తారు.... ఇప్పటికే మీకు శ్రమ ఇచ్చాం..." అన్నాను.

"...ఆఁ.... ఆఁ.... అదేమీలేదు... మావాళ్ళేవస్తే ఈమాత్రంచేయమా? ....అయినా అప్పుడే ఏమితొందరా?.... మరో రెండురోజులు వుండరాదూ...." అన్నారు.

"ఇప్పటికే రెండురోజులు పూర్తవుతాయి రేపటికి...." అన్నాను.

ఆయన ఏమీ మాట్లాడలేదు.

మా యిద్దరిమధ్యా అందమైన నిశ్శబ్దం.

కొంతసేపటి తరువాత—

"మీ కుటుంబ విషయం అడుగుతున్నాననుకోకండి...." అన్నా నేను. ఈ యింటిలో నాకు శివయ్యగారు, సీతమ్మగారు తప్ప మరెవరు కన్పించడంలేదు. ఈ దంపతులకు ఎవరూ లేరా?

"మీకు అభ్యంతరం లేకపోతేనే?" అన్నాను.

"ఇందులో అభ్యంతరానికి ఏముంది నాయనా?" అని కండువాతో కన్నీళ్ళని తుడుచుకొని, చెప్పడం మొదలుపెట్టారు. ఒళ్ళోవున్న రత్నం కొడుకు ఆయనకేసి ఆసక్తిగా చూస్తున్నాడు.

"వుండేదినాయనా! 'నాన్న' 'నాన్నా' అంటూ అమ్మాయి... హాయిగా అడ్తూ, ఆనందంతో చిందులువేస్తూ.... వాళ్ళమ్మదగ్గరకంటే నాదగ్గరే చను వెక్కువ... ఏమడిగినా కాదనేవాడ్నికాను... నా గుండెలమీద పెంచాను... నా బంగారుతల్లిని మురిపెంగా పెంచాను... ఏ ఈడుకా ముచ్చట తీర్చాను.... ఆనందంగా ఈ చేతులతోనే పెళ్ళిచేశాను...." ఒక్కక్షణం భారంగా నిట్టూర్పు విడిచి—

"పెళ్ళయ్యాక ఓసారి నా చిట్టితల్లి 'తిరుపతి' యాత్రకి వెళ్దామండి.... ఏదో పని హడావిడిలో వుండడంవల్ల అల్లుడ్నిచ్చి పంపించాను.... సీతకూడా నాతోనేవుండిపోయింది.... అంతే.... అదే ఆఖరురోజు..." కళ్ళలో కన్నీళ్ళు.

"....ఘాట్‌రోడ్డుమీద వెళ్తున్న బస్సు తిరగబడింది...." కన్నీళ్ళని ఆపుకోలేకపోయారు.

ఆయన ఒళ్ళోవున్న రత్నం కొడుకు ఆయన్నిచూసి కెవ్వుమన్నాడు.

"ఛడవా! నీకుకూడా నామీదజాలే!" అంటూ కండువాతో కన్నీళ్ళని తుడుచుకున్నారు.

నా హృదయం చివుక్కుమంది.

"భగవాన్! ఎంతపనిచేశావ్?"



# తపః ఫలం

శ్రీ కావూరు పాపయ్యశాస్త్రి

ఏ పుండరీకం
కన్నులన్నిటా నీ రూపు నిలిపి
ఎంతగా తపించి
ఆ బృందావనిలో
తన బ్రతుకును పండించుకుందో!
సుస్నిగ్ధ సుస్మితాపాంగ రోచిస్సులతో
నీ కనుదోయిగా రూపొందటానికి!

అలమందల మేపుతూ
అలసి సొలసిన నీకు
ఏ నీలజలదం
అతపత్రంగా సేవించిందో
నీ శ్యామాభిరామ తనూరామణీయకతగా
తానుగా మారటానికి!

సురభిళమైన
నీ మేనిపైనుండి వీచిన
మంద పవన వీచికలను
ఏ వెదురు ఎన్నాళ్ళుగా పలికిందో!
నీ పెదవులపై
పిల్లగ్రోవిగా నిలవడానికి!
నీ కోమల వంశీగాన మాధురీ మహిమకు
ఏ మయూరం పరవశించి
మత్తుగా నర్తించిందో!
నీ సిగలో సొగసుగా
భాసించడానికి!

ఆర్ద్రమైన ఏ శరద్రాత్రి
వెన్నెల పన్నీటి జల్లులో
నిన్నభిషేకించిందో
నీ అధరాలపై
సురుచిర సుందర మందహాసంగా
నిరంతరం వెలుగొందటానికి!
ఏ అడవిపూలు
నీ నడచిన బాటలో పరచుకుని
నీ అడుగులబడి నలిగినవో!
నీ మెడలో పూమాలగా
అందగించడానికి!

ఏ యమునాధుని అలలడోలిక
నీ నావనూయలలూపి
నిన్నలరించి తరించిందో!
నీ హృదంతరాంతర
మృదుగీతికా రసధునిగా
మధుర వేదనాకృతిగా
నీ ఎదలో ఎదగా
ఒక రాధగా
ఒదిగిపోవటానికి!

మర్నాడు—

అనుకున్నట్టే మరో బస్సులో మావాళ్ళు వచ్చారు.

భోజనాలు పూర్తయ్యాయి.

బయలుదేరడానికి వుపక్రమించాం.

సీతమ్మగారు తెగ 'సతమత' మవుతున్నారు.

శివయ్యగారు అందిన పిల్లాడిని అందినట్టే ముద్దాడుతున్నారు.

మరో రెండురోజులు వుండయినా బలవంతాన వాళ్ళని ఒప్పించి బయలుదేరుతున్నాం.

సీతమ్మగారు ఆడవాళ్ళందరికీ పసుపు కుంకుమలు యిచ్చారు.

ఈ రెండురోజుల్లో వాళ్ళుచూపిన ప్రేమా, అప్యాయత నెమరువేసుకుంటూ ఆ దంపతుల ఆశీర్వాదం తీసుకొని అక్కడ్నుంచి కదిలాము.

బస్సు మెల్లగా కదిలింది.

మేమందరం దండాలుపెడ్తుంటే ఆ దంపతులు చేతులు వూపుతున్నారు. శివయ్య, సీతమ్మగార్లు.

మెల్లగా—

ఆ యిల్లు దూరమవుతోంది....

కళ్ళలో లీలగా కన్నీటిపొర కదిలింది....

కన్నీటి పొరచాటున....

దూరంగా....

పుణ్యదంపతుల్లా శివయ్య, సీతమ్మగార్లు.

పుణ్యక్షేత్రంలా ఆ యిల్లు!

బస్సు మరో 'పుణ్యక్షేత్రంవైపు పరుగులుతీస్తోంది!